

అత్తగారూ- పనివాళ్ళూ

భానుమతీ రామకృష్ణ

ఆ రోజు ద్వాదశి అయినందువల్ల మా అత్తగారి
ోజనం త్వరలోనే అయింది ఆమె భోంచేస్తూనే
ంటవాడు తిరువేంగళాచారి భోంచేశాడు వంటింటి
నక ఉన్న వరండాలో భోజనానికి కూర్చున్నాడు
నిపిల్లవాడు గుండుమణి—

వీధిలో ఎవర్‌సిల్వర్ పాత్రల వాడికేక విని మా
త్తగారు వాణ్ణి పిలిపించారు ఘూర్కావాడి
త—వాడి బుట్టలో ఉన్న పాత్రలన్నీ ఒక్కొక్కటే
సి పక్కన పెట్టుకున్నారు, యిది చారుకీ, ఇది
లుసుకీ, యిది పప్పుకీ, యిది పాయసానికీ అంటూ
—చివరికి గోరంత జరీ కూడా లేని ఎలకలుగొట్టిన
ఆమె పాత మడి చీర ఒకటీ, నావి రెండు మూడు
త జాకెట్లూ తెచ్చి వాడి ముఖాన పడేసి ఆ
త్ర సామానంతా కావాలన్నారు—వాడు ఒక్క
మస్కారం చేసి బుట్ట సర్దుకోబోయాడు
మిస్తావో తేల్చి చెప్పిందాకా పాత్ర లివ్వనన్నార్స
ా అత్తగారు .... వాడికి ఒళ్ళుమండి బుట్టంతా
తికి ఒక చిన్న స్పూను తీసి "మీ రిచ్చిన గుడ్డ
కి యిదీ ఒచ్చేది" .... అంటూ అలక్ష్యంగా ఆమె
యందుకు విసిరేశాడు.. ..

మా అత్తగారికి ఒళ్ళు తెలిని కోపం వచ్చింది .
"ఛీ వెధవా ! .... నువ్వుగాకపోతే నీ తలదన్నినవా
ంకోడొస్తాడు.... అసలు నిన్ను పిలవడం నాదే
ుద్ధితక్కువ .... కొవ్వెక్కిన గాడిద ! ఎంత
గ్రా నీకు ! .... విక్షేపంలాంటి గుడ్డలకి ఒక్క
్పూనిస్తావా ! .... ఆ బోడి స్పూను నువ్వే
ంమకో.... వా తక్కర్లా" .... అంటూ వాడి
పాత్రలు సొట్టలు పడేటట్లు విసురుగా వాడి ముందు
నెట్టిపారేశారు

"ఓ, ఓ, ఓ, పెద్దమ్మగారూ . ఆగుడ్డ
లూరకిచ్చినా మా కొద్దుగానీ, పాత్తర్లు కాస్త మెల్లి
గియ్యండి సొట్టలు పడితే మా యజమా నూరు
కోడు . మీ రయ్యే గుడ్డ లిస్తారని తెలిసుంటే
ఒచ్చేవోణ్ణే కాదు . మీతో బేరం కుదర్దులెండి"



రచయిత్రి

అంటూ వాడు బుట్ట సర్దుకుని వెళ్లిపోయాడు...
దీంతో ఆ ఎవర్‌సిల్వర్ పాత్రలవాడు మూడోసారి
వచ్చి బేరం కుదరక వెళ్లడం .... వాడికి సహస్ర
నామం చదువుతూనే మా అత్తగారు ఆ పాత
గుడ్డలు మూటగట్టారు—యిప్పటికి అవే గుడ్డలు
కనీసం యాభైసార్లయినా మూటకట్టి ఉంటారు..
ఇంతవరకూ ఏ ఎవర్‌సిల్వర్‌వాడూ ఆ గుడ్డలు తీసు
కుని పాత్ర లిచ్చిన పాపాన పోలేదు ....

నాకా గుడ్డలమూటంటే ఒళ్ళుమంట ....

"పోనీ పనిమనిషి చీరల్లేవని బాధపడుతోంది
ఆ గుడ్డలు దానికిస్తే ఒదిలిపోతుందిగా!" అంటూ
వో చిన్న సలహా యిచ్చాను మా అత్తగారికి ....

"ఇంకా నయం ! నిక్షేపంలాంటి నా మడి పట్టు
చీరానూ, దుక్కల్లాంటి నీ జాకెట్లానూ తీసు
కెళ్లి పనిదాని కిమ్మంటావా ! .. నీకేమైనా మతి
పోయిందా ?. . "అంటూ మందలించారు నన్ను

"పోనీ ఆ గుడ్డలతోబాటు నా పాత పట్టుచీరలు
బాగా జరీ ఉన్నవి వేసి మనక్కావలసిన పాత్రలు
తీసుకోగూడదూ !...." అంటూ మరో సలహా
యిచ్చాను

"అమ్మ ! .. బంగారంముద్దలాంటి నీ జిల్తారు
చీరలు యీ ముష్టిపాత్రల కిస్తానంటావా ! "
చాల్లే, వూరుకో . ఎవరన్నా వింటే నవ్విపోతారు .
మరీ అంతగా చిరుగు పట్టినప్పుడు జిల్తారు
కరిగించి ఏ వెండి గ్లాసులో, చెంబో చేయిస్తాను ..
అంటూ ఆ పాత గుడ్డలమూట 'స్టోర్' రూములో
ఉన్న బీరువాలో భద్రంగా దాచడానికి వెళ్లారు.

* * *

"పెద్దమ్మగారూ, పెద్దమ్మగారూ" అంటూ
హడావిడిగా పరుగెత్తుకొచ్చాడు వంటవాడు
వెంగళాచారి ..

అతని వెనకాలే పనివాడు గుండుమణి విసురుగా
వచ్చాడు ...

"ఓ రూపాయుంటే పారెయ్యండమ్మగారూ ..
హోటల్లోనన్నా తినొస్తాను . రోజూ ఈ ఎదవ
తిండి తిన్లేక చస్తున్నా "అన్నాడు.

"చూశారా ! చూశారా ! వెధవ తిండట ....
అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నారు ... తినే
కంచాన్ని నేలకేసి కొట్టవచ్చా ! . ఎంత అపచారం !
ఎంత అపచారం !.. ." అంటూ వాపోయాడు వంట
వాడు !....

"చాల్లేవయ్యా పెద్దమనిషి మాడిపోయిన
పప్పు తెచ్చి నా మొకాన గొట్టి తినమంటే ఎట్ట
తినేది !.. పైగా మాడు కంపుతోనన్నా తినొచ్చు
గాని, ఆ మాడువాసన రాకుండా ఉంటానికి ఏదో
శెంటు బోశాడమ్మగారూ . . బాబోయ్ యిం
ఆ కంపు ఏం చెప్పమంటారు . డోకొచ్చిందనుకోం
ఆ శెంటు వాసనకి . అయినా ఒంటి కేసుకునే
శెంటు ఒంటకాల్లో వేసుకుంటారండీ ఎవురన్నా !. ."

"హరిహరీ! . అది శెంటుగాదు ! ... పన్నీరు—
పన్నీరు బోశాను లక్షణంగా . "

"ఆ, లక్షణంగానే ఉందా కంపు .. "

"అంతే అంతే .... నీ కది కంపుగానే ఉంటుంది.
వూరికే అన్నారా'.. .'పంది బురద మెచ్చు పన్నీరు
మెచ్చునా'.... అని."

"యిదుగో వంటాయనా ! మాటలు జాగర్తగ

రానీ ఏమన్నావ్ ! నేను వందినా". అంటూ గుండుమణి గుడ్లెర్రజేశాడు . వంటవాడు నిలువునా ఒణికిపోతూ మా అత్తగారి కోసం లోపలికి పరుగెత్తాడు యింట్లో మావారు గానీ, మావాడుగానీ, సాధారణంగా భోంచే య రు . మా అ త్త గారి సూ ప ర్ వి ష న్ లో జ రి గే వంట సరిగా ఉండదని మావారు ఆఫీసుకు దగ్గిరగా ఉన్న ఉడ్‌లాండ్స్ హోటల్నుంచి భోజనం తెప్పించుకుంటూరు మావాడు పగలు హాస్టల్లో భోంచేస్తుంటాడు రాత్రిళ్లు ఇద్దరూ భోంచేయరు గనుక ఫలహారం గూడా బయట్నే ముగించుకొస్తారు యిక నేను అన్నం తింటే ఒళ్ళొస్తుందనే భయంతో గుండుమణి చేసే విజిటబుల్ సూపుతోనూ, చపాతీలతోనూ, కాసిని మజ్జిగ తాగి కాలక్షేపం చేస్తుంటాను— అందువల్ల వంటవాడు కేవలం మా అత్తగారి మడి వంట మాత్రం చేస్తుంటాడు అది పనివాళ్ల పాల బడుతోంది

"ఏమిట్రా మహా నీలుగుతున్నావ్ ! ఏమిటీ నీ ఆగడం! నీ తిండిని గురించి కూడా రాద్ధాంతము చేస్తున్నావా ! మే పెట్టే దది తింటే తిను, లేకపోతే పో. " అంటూ మా అత్తగారు వంటవాణ్ణి వెనకేసుకొచ్చారు .

"పోతానమ్మా యీ తిండి దింటూ ఎవరుంటారు !. యీ తిండి కుక్కలు గూడా తినవ్ "

"ఆ ! ఆ ! తలపొగరు వెధవా ! ఏమన్నావ్ !— కుక్కలు కూడా తినవా ! అయితే మేమంతా ఎవరని నీ ఉద్దేశం ! "

"మిమ్మల్ని నే నన్లేదమ్మగారూ మాట పామెతకి జెప్పాను రోజూ తినేయన్నీ మాడుస్తూ ఉంటే ఎట్టా తినేది ! "

"నేను తింటంలేదట్రా ! అయినా వాడు గావాలని మాడుస్తున్నాడా ఏమన్నానా ! . ఆపనికీ యీపనికీ అటూ యిటూ తిరగటంలో అడుగంటుకున్నాయి .. ఆమాత్రానికే అన్నం నేలకేసి కొడ్తావా ! "

"అన్నంగాదమ్మా !.. పప్పు పన్నీరు పప్పు "

"ఏంరా ! ఏమైంది పన్నీరు పప్పుకి !.. లక్షణంగా ఘుమఘుమ లాడుతోంది ."

నాకు ఫక్కున నవ్వొచ్చింది ఆపుకున్నా.

"ఆ గమగమే మరి . శెంటు పప్పు గదూ! "

"శెంటుపప్పో, శెనగపప్పో నీకు దొరికేదది ... తింటే తిను, పోతే పో ...." అన్నారు ఖచ్చితంగా మా అత్తగారు

"అట్టాగే నే తిన్లేను. పోతా .... అంటూ గుండుమణి బయల్దేరాడు ....నా గుండెల్లో రాయిపడ్డది... వాడు వెళ్లిపోతే నా తిండి సంగతి అట్లా ఉంచి మావారికీ, మా వాడికీ కోపం వస్తుంది .. .ఇంట్లో ఉన్న కాసేపూ వాళ్లిద్దరి పన్లకూ వాడు ప్రతిక్షణం అవసరమే వాడు లేకపోతే యింట్లో పై పన్లకు యిబ్బందిపడాలి . అందువల్ల, నేను కలగ జేసుకోక తప్పలేదు—"

"అది కాదత్తా! మాడిన పప్పులో పన్నీర్రు బొయ్యడమేమిటి ఇది నే నెక్కడా విన్లేదే! ..." అన్నాను.

"అయ్యో ఆ మాడువాసన రాకుండా ఉంటానికేనే .. నేనే జెప్పాను వాడికి కాస్త పన్నీరు పొయ్యమని లేకపోతే వాడి కా తెలివితేటలు గూ ా ఏడ్చాయీ నా చిన్నప్పుడు మా ఇంట్లో వీడి అబ్బేగా వంట జేసేవాడు! . . అతనూ ఇంతే . ఒట్టి చాదస్తుడు .. రోజూ అన్నమో పప్పో అడుగంటిస్తుండేవాడు , ఇక ఇట్లాగాదని మా నాయనమ్మ అతనికో ఉపాయం జెప్పింది—అడుగంటిన పప్పులో కాస్త పన్నీరు వెయ్యమని . . ఇక పన్నీరుపప్పంటూ పిల్లలం పప్పంతాతి నేసేవాళ్లం.. ఇంకా అప్పటికీ వెధవ పుట్టలా " అని మా అత్తగారు చెప్తుంటే చేతులు నులుపుకుంటూ వినయంగా తలవంచుకున్నాడు వెంగళాచారి వాళ్ల నాయనమ్మ అడుగుజాడల్లో నడిచే మా అత్తగారు వెంగళాచారి ఏం మాడ్చినా ఎందుకు వెనకేసుకొస్తున్నారో నా కప్పుడర్థమైంది ఒకప్పుడు వెంగళాచారి తండ్రి మా అత్తగారింట్లో వంట జేశాడు . అదీ ఆమె అభిమానానికి ముఖ్యకారణం

మావాడు కాలేజీనుండి వచ్చేశాడు వస్తూనే "నాయనమ్మా" అంటూ పిల్చాడు

"మా నాయనగదరా, నా తండ్రిగదరా . వస్తూనే నన్నే పిలుస్తాడు నా దేవుడు ...." అంటూ మా అత్తగారు సంతోషపడిపోతూ మా అందర్నీమర్చిపోయి మనవడి నడుంచుట్టూ చెయ్యేసి నడిపించుకుంటూ మేడమీది కెళ్లారు ఆమె పై కెళ్లగానే పనివాడు గుండుమణికి ఒక రూపాయిచ్చి హోటల్లో భోంచేసి రమ్మని పంపించాను

మా అత్తగారు సంబరపడిపోతూ కిందికి దిగొచ్చారు

"ఏమేవ్ నా మనవడికి రేపు లీవట ఇంట్లో భోంచేస్తానన్నాడు రేపు వాడికి బాదంకీరు కావాలట "

'ఒరేయ్ వెంగళం అబ్బాయికి రేపు ఘట్టిగా బాదంకీరట చెయ్యి ' అంటూ వంటవాడితో చెప్పారు ఒక క్షణం వంటవాడు అయోమయంగా మా అత్తగారివేపు చూసి,

"చిత్తం చిత్తం ఆలాగే అంతకంటేనా! తప్పకుండా అచ్చాయిగారు ఇంట్లో భోంచేస్తానంటమే ఒక విశేషం" .అంటూ తిరువేంగళం సంతోషపడిపోయాడు . .

బాదంకీరు చెయ్యమన్నాడేగాని మర్నాడు మా వాడు ఎవరిదో ఫ్రెండ్ బర్త్ డే అంటూ భోజనానికి వెళ్లాడు

ప్రొద్దుటే గుడికెళ్లి భోజనాల టైముకు మనవడొస్తాడని ఎంతో ఆత్రంగా ఇంటికొచ్చి మా అత్తగారు మనవడు ఎవరో ఫ్రెండింట్లో భోజనానికి ఆగిపొయ్యాడని విని కాస్త నిస్పృహ జెందారు.... .

"ఇలాంటి వాడెందు కడగాలి బాదంకీరు చెయ్యమని మహ తినేట్టు! . . .అయినా వాళ్లిద్దరూ ఏనాడు ఇంట్లో భోంచేశారు గనక......పోనీ నువ్వన్నా ఈరోజు ఒక ముద్ద తినవే"......అంటూ నన్ను బలవంతం జేశారు.. విధిలేక ఆమెతోబాటు నేనూ భోజనానికి కూర్చున్నాను.

తిరువెంగళం వడ్డించడం మొదలెట్టాడు. పప్పు బాగానేఉంది బీన్స్‌వేపుడుమాత్రం మాడిపోయి బొగ్గుల్లా కనిపించాయి . ..పులుసులో వేసిన వంకాయ ముక్కలు బాగా అడుగంటాయి... చారు ఏదో ఆయుర్వేదం మందు వాసనొచ్చింది. ఇక పచ్చళ్లు మా అత్తగారు చేసినవే గనక వాటి వాసన చిరపరిచితమే.. ...

చివర్లో సెగలూ, పొగలూ కక్కుతున్న గిన్నె ఒకటితెచ్చి మా ముందు పెట్టి గిన్నె మీధున్న మూత తీశాడు

గుప్పున ఉల్లి, వెల్లుల్లి, ఇంగువ, మసాలా, పన్నీరు వగైరా అన్నీ కలిపిన నానా దివ్య పరిమళ గంధా ౦ ముక్కులు బ్రద్దలయ్యేట్లొచ్చింది.

"ఛీ ఛీ అప్రాచ్యుడా—ఏమిట్రా ఈ ఖర్మం! అంటూ మా అత్తగారు ముక్కులు మూసుకుని కంచం దగ్గిర్నుంచి చివాల్న లేచారు . .వంటవాడు ఆపాదమస్తకం వణికిపోయాడు

"తమరు క్రీరు చెయ్యమన్నారు .." ఫక్కున నవ్వేశాను

"క్రీరేమిట్రా!"

"అదే అదే బాదముక్రీరు ..."

మా అత్తగారు కూడా నవ్వాపుకున్నారు

"నీ క్రీరు మండిపోను ఇదేం క్రీరా! . . మసాలా కంపు కొట్టుకుంటూ ఇదట్రా నిన్ను చెయ్యమన్నది! లక్షణంగా తియ్యగా పాయసంలా ఉండాల్సిన బాదంకీర్ను ఈ గతి పట్టించావేంరా! అసలు ఇది నువ్వు జేశావా లేక ఆ మసాలా వెధవ మణి జేశాడా! ".

వంటవాడికి ముచ్చెమటలు పోశాయి

"ఎంతమాట! ఎంతమాట! ..వాడు చెయ్యలేదు . ఎట్లా చేయాలో అడిగి తెలుసుకున్నాను. . అంతే "

"ఓరి బ్రాష్టం! వాడి నడిగి తెలుసుకున్నావా!

49 వ పేజీ చూడండి

నీకు తెలీకపోతే తెలీదని అఘోరించ[illegible]యినావా! అసల్నాతో ఎందుకు చెప్పలేదు నువ్వు...."

"చిత్తం. తమతో మనవి చేసుకుందాం అనుకున్నాను. కాని ప్రొద్దుటే తమరు గుడికివెళ్ళేటప్పుడు అడిగితే బాగుండదని వూరుకున్నాను.....అమ్మగారు పూజలో ఉండిపోయినారు....ఏం చేయాలో తెలీక మధన పడుతుంటే గుండుమణి అయ్యోరేమో నే చెప్తా చెయ్యి అన్నాడు. ...రక్షించావురా నాయనా అనుకుని వాడు చెప్పినట్టల్లా ముక్కలు మూసుకుని చేశాను.......పెద్దవాణ్ణి......" వంటవాడి కండ్లల్లో నీళ్లు తిరిగాయి పాపం.....

"హారి దొంగభడవా!......అసలేడీ? ఆ మసాలా వెధవ!......" అంటూ గుండుమణిని వెతుక్కుంటూ పెరట్లోకి వెళ్లారు మా అత్తగారు.

వంటవాణ్ణిచూస్తే జాలేసింది.....

"అసలు వాడెట్లా చెయ్యమని చెప్పాడు" అని అడిగాను.

వంటవాడు కండ్లు తుడుచుకుంటూ చెప్పుకొచ్చాడు.

"ఒరే అబ్బి నాకా బాదముక్రీరు చేయడం రాదు. నీకేమైనా వచ్చునా అని అడిగాను..... ఓ అదేం పెద్ద కష్టంగాదు.....రెండు ఉల్లిగడ్డలూ రెండు వెల్లుల్లిగడ్డలూ తరిగి పెట్టుకో... బాదంపప్పూ, ఆ ఉల్లిగడ్డల ముక్కలూ పచ్చిమిరపకాయలూ అల్లం, చెక్క, లవంగం, యాలక్కాయలూ కాస్త ఇంగువ చేర్చి మెత్తగా రుబ్బు.. ఒక శేరు పాలలో కొద్దిగా పెరుగు కలిపి పొయిమీద బాగా మరగనిచ్చి, ఈ మసాలా ముద్దను మరిగే పెరుగు పాలల్లో కలిపేసెయ్....చివర్లో కాస్త పన్నీరు పోసెయ్. 'క్రీర్ క్రీర్' అని గిన్నెలోంచి శబ్దం వస్తుంది.......దించెయ్......అదే బాదంక్రీరు......." అంటూ ఆ పని వెధవ వంటవాడికి కీరు చేసే విధానం విశదీకరించాట్ట... పాపం వాడు చెప్పింది తు. చ. తప్పకుండా భక్తిగా చేశాడు చాదస్తుడు ...

మా అత్తగారికి పనివాడు కనిపించలా. ఎక్కడో దాక్కున్నాడు..... పన్నీరు పప్పు పెట్టి వంటవాణ్ణి వెనకేసుకొచ్చినందుకు వాడు కావాలని చేశాడు...

"ఆ మసాలా వెధవెక్కడా కనిపించలా... రానీ చెప్తా" అంటూ కాళ్లూ చేతులూ కడుక్కొచ్చి భోజనానికి కూర్చున్నారు. ఈలోపుగానే ఆ మసాలా గిన్నె పెరట్లో అంట్లల్లో పడేయించాను ..

భోంచేసి హాల్లో కొచ్చి కూర్చున్నాం. మా అత్తగారూ నేనూ. . ఉన్నట్టుండి పెరట్లోంచి ఏదో గోల బయల్దేరింది.

అత్తగారూ - పనివాళ్ళూ

11 వ పేజీ తరువాయి

పనివాళ్లు దెబ్బలాడుకుంటున్న అరుపులు వినిపించాయి.........

మా అత్తగారు ఖంగారుపడుతూ పెరటి వేపుకు పరుగెత్తారు. నేనూ ఆమె వెనకాలే వెళ్లాను.

పనిమనిషి ఎల్లమ్మ అంట్లన్నీ ముందేసుకుని కొళాయి తిప్పితే నీళ్లు రాలేదట..... పక్కనే వున్న భావిలోంచి రెండు బిందెలు నీళ్లు తోడియ్యమని గొడ్లపనివాడు సుబ్రమణిని అడిగిందట. అటువంటి సమయంకోసమే కాచుకోనున్న ఆ కొంటె వెధవ భావిలోనుంచి నీళ్ళు తోడి తెచ్చిన వాడు వూరికే ఇవ్వక కాసిని నీళ్ళు ఆ పనిమనిషి ఒంటిమీద పడేట్టు చేయి విదిల్చాట్ట.... .తక్షణం వాడిమీద గజ్జలగుర్రంలా విరుచుకుపడ్డది ఎల్లమ్మ.

వాడదేం లక్ష్యం చేయకుండా నవ్వుకుంటూ మామిడి చెట్టుకింద తన పని తను చూసుకుంటున్నాడు.

"నవ్వుతావేంరా నడమంత్రప్పు గాడిద!...... సిగ్గు లేకుండా ఇవేం పన్లురా!.....ఆంబోతులా వూరుమీద పడితే వూరుకుంటారనుకున్నావా!..... ఎముకలు విరగ్గొడతారు.......పాపం దానిపనేమిటో అదేమిటో........ఒకళ్ల జోలి దాని కక్కర్లేదు......నిప్పులాంటి పిల్ల.....నీకేం పోయేకాలంరా దాని జోలికిపోయావ్!....."అంటూ మా అత్తగారు చీవాట్లు పెడుతూంటే సుబ్రమణి బ్రేండో స్టయిల్లో నవ్వాడు......వాడు మేర్లోన్ బ్రేండోలా ఉంటాడని మావాడు, వాడిని 'బ్రేండో' అని పిలుస్తుంటాడు.....

"అది నిప్పుగాదు పెద్దమ్మా...ఒట్టి పప్పు అదంతా పైకే.....దాని కంతా ఉందిలెండి యవారం" అంటూ ఈలేస్తూ కొంటెగా ఎల్లమ్మవైపు చూశాడు..... అది కూడా వాణ్ణొక వోరచూపు చూసి ఏమీ ఎరగనట్టు తన పని తను చూసుకోడం మొదలెట్టింది.....

ఎల్లమ్మ పనిలో చేరాక నే నెప్పుడూ దాన్ని పరీక్షగా చూళ్లేదు. చామనచాయగావున్నా చిలకలా అందంగానేఉంది ... అంతవరకూ అభాయిత్యంగా కేక లేసిందేగాని దాని ముఖంలో కోపంగానీ, అవమానంగానీ మచ్చుకైనా కనిపించలా......

"ఎల్లమ్మా!...."అంటూ పొలికేక వినిపించింది... వెనక్కి తిరిగిచూశాం.....దాని మొగుడు ..మా పక్కింట్లోనే వాడు వంచేసేది....మా పెరట్లో ఏం గొడవ జరిగినా పిట్టగోడ మీదనుంచి వాడు చూస్తుంటాడు......జరిగిందంతా చూశాడో ఏమో కోపంతో బుసలు కొటుతూవచ్చి నిలబడ్డాడు.... ఎర్రగావున్న వాడి కండ్లు సుబ్రమణిమీద నిప్పులు కక్కుతున్నాయి ....

మా అత్తగారికి ఒణుకు పట్టుకొంది... గబగబ నా దగ్గిరికి పరుగెత్తుకొచ్చారు.

"ఒసేవ్ వీళ్ళు కొట్టుకు చచ్చేట్లున్నారు... పోలీసుల్దాకా పోకముందే ఆ పోకిరీ వెధవనీ, దాన్నీ పంపించేద్దాం ... అంట్లు కావాలంటే నేనూ, వెంగళం తోముతాం..."అంటూ గాభరాపడిపోయారు.

"ఏంటే! ఏం జరిగింది! నీమీద నీళ్ళు బోశాడా వాడు?...చెప్పు....యిప్పుడే వాణ్ణి నరికి పోగు లేస్తాను..." అని గట్టిగా అరిచాడు ఎల్లమ్మ మొగుడు... వాడి చేతులో కొడవలిగూడా ఉంది...

"ఓయమ్మ ఏమిటే యీ పీడా..."అంటూ గజగజ లాడుతున్న మా అత్తగారు నా చెయ్యి గట్టిగా పట్టుకున్నారు.

సుబ్రమణి నిర్లక్ష్యంగా యీలేసుకుంటూ పని చేస్తున్నాడు.

ఎల్లమ్మ ఏం జెప్తుందోనని అందరం ఆదుర్దాగా ఎదురు చూశాం.

ఏమీ ఎరగని నంగనాచిలా, "ఏంటి మావా!.... నీళ్లేంటీ!....ఎవరు బోశారూ!...."అంటూ ఎదురు ప్రశ్నేసింది మొగుణ్ణి....

"హారి దీని తస్సాదియ్యా....విన్నావంటే!....." అంటూ నా చెవు దగ్గిర గొణిగారు మా అత్తగారు.

"నిజం చెప్పు!.....వాడు నీళ్లు పోశాడా లేదా"

"అబ్బే లేదు మావా!.....ఆ యబ్బి నా వూసుకే రాడు.......కొళాయిలో నీళ్లు రాలేదంటే బాంవ్లో నీళ్లు తెచ్చిచ్చాడు.....అంతే. ఇంకా ఎప్పుడైనా ఈ

వంటాయనే నా ఆరటామీద చెయ్యేస్తాడు శేతా వస్తే'' .. అంటూ యాభై అయిదేండ్ల తిరువేంగళాచారిమీదికి తిప్పింది కథంతా.

''శ్రీహరీ! పాపము శమించుగాక .''అంటూ చెవులు మూసుకున్నాడు వెంగళాచారి . .

''హవురా! హవురా! . ఏం కైకవే! . ఏం కైకవే! .. .'' అంటూ ఎల్లమ్మమొగుడు చూడకుండా గుండెలు బాదుకున్నారు మా అత్తగారు.

ఎల్లమ్మ మొగుడు వంటవాడివైపు భయంకరంగా చూశాడు .

''ఏం వంటాయనా ప్రాణాలమీద ఆశ లేదులు కున్నావా! ...'' అంటూ ముందు కొచ్చాడు . . .

వంటవాడి పై ప్రాణాలు పైనేపోయాయి.

''హా శ్రీనివాసా! ఏమిటీ అభాండం! .. ఏనాడో స్వసుఖములను త్యజించి, శరీర సౌఖ్యములను మరచి, వంట చెరుకుల్లో వంట చెరుకువలే సదా అగ్నిహోత్రం దగ్గిర అలమటించే నాకా ఈ అపవాదు. . ..''అంటూ వాపోయాడు వంటవాడు

మలేరియా వచ్చిన వాడికిమల్లే భయంతో వంటవాడు ఒణకడంచూసి గొడ్లను కడుగుతున్న సుబ్రమణీ, తలుపుచాటున నిలబడి తమాషాచూస్తున్న గుండుమణీ, పడీ ఎడి నవ్వడం మొదలెట్టారు.

''ఎల్లమ్మ చెప్పింది నిజమే యీ వంటాయన ఎల్లమ్మంటే పడి చస్తాడు .ఎందుకు రోజూ గిన్నెల గిన్నెలు అన్నం, పులుసూ, కూరల్లా పెద్దమ్మగారికి తెలీకుండా దొంగచాటుగా ఎల్లమ్మకిస్తుంటాడు'' అని చెప్పాడు గుండుమణి.

ఒక్కక్షణం అనుమాన మేఘం మా అత్తగారి ముఖాన్ని ఆవరించింది

అది చూసిన వంటవాడు ఖంగారుపడిపోతూ మా అత్తగారిముందు చేతులు జోడించి, ''అమ్మా మీరు నన్ను సందేహిస్తున్నారా! దండించినా, ఖండించినా పెద్దవారు. కాదనను ఒక్కటి రెండుసార్లు మిగిలిపోయిన పదార్థాలు ఎక్కువగానే ఇవ్వడం జరిగింది .కావాలని ఇవ్వలేదు .. ఇది ఆ కుర్రవాడి కల్పన నామీద ఉండే ద్వేషం వల్ల చెబుతున్నాడు వృద్ధిలోకి రావలసినవాడు . . పెద్దవాళ్లే నామీద ఇటువంటి అభాండం వెయ్యతగునా!.......ఏనాడో స్వసుఖాలను త్యజించి, శరీర సౌఖ్యాలను మరచి ''

''అబ్బబ్బ ఆపవయ్యా నీ అష్టోత్తరం అసలు వన్నడక్కుండా మిగిలినవైనా సరే నిన్నెవరిమ్మన్నారు దానికి!.... '' యీ ప్రశ్నకు ఉక్కిరి బిక్కిరయ్యాడు వంటవాడు.

''అయ్యో పెద్దమ్మగారూ ... చాలాసార్లు బియ్యం, పప్పూ, చక్కెర, నెయ్యి, మానె ఒక పెంటిలెండి శానా ఇచ్చాడు మీకు తెలీకుండా .. తనెన్నిసార్లు కాఫీ తాగితే ఎల్లమ్మ కన్నిసార్లు ఇయ్యాల్సిందే ... ఒకసారి మీరు పాలడిగితే లేవన్నాడు. ఆరోజు ఈళ్ళిద్దరూ ఆరుసార్లు తాగారు కాఫీ. నే నెప్పుడన్నా రెండోసారి కాఫీ అడిగితే కసిరి కొడతాడు.. ..''

''ఒకసారి సినిమా కెళ్దాంరా అని గూడా పిల్చాడంట ఎల్లమ్మని ....కదెల్లమ్మా! ...'' అని అడిగాడు గుండుమణి ..

అత్తగారూ - పనివాళ్లూ

''అవును'' అంది నంగనాచిలా బుంగమూతి పెట్టి ఎల్లమ్మ

ఆ మాట విన్న ఎల్లమ్మ మొగుడికి ఎక్కడలేని ఆవేశం వచ్చి కొడవలి తీసుకుని వంటవాడిమీదికి దూకాడు. .

''శ్రీనివాసా! .''అంటూ ఒక్కవెర్రికేకపెట్టాడు వెంగళాచారి. మరుక్షణం సుబ్రమణీ, గుండుమణీ ఒచ్చి అడ్డుపడి ఆపారు

ఇదే సమయమని వంటవాడు పూజగదిలోకి పరుగెత్తి తలుపులు మూసుకున్నాడు సుబ్రమణీ, గుండుమణీ, ఎల్లమ్మ మొగుణ్ణి పట్టుకోనుండడం చూసి మా అత్తగారు కాస్త ధైర్యం తెచ్చుకున్నారు

''ఒరే అబ్బీ! ఏమిట్రా నీ దౌర్జన్యం! .. నీ పెళ్లాన్ని అదుపులోపెట్టుకోలేక కొడవళ్లూ కత్తులూ తీసుకుని పూళ్లో వాళ్ళమీదికిపోతే పూరుకుంటారా! పోలీసులకి పట్టిస్తారు . . దాని పనీ ఒద్దు పాడూ వద్దు ముందు నీ పెళ్లాన్ని తీసుకుని బయటికి నడు. అది ఎక్కడుంటే అక్కడ నిప్పు లేకుండా అంటుకుంటాయి కొంపలు

ఊఁ నడవండి బయటికి . ఆంటూ ఎల్లమ్మనీ దాని మొగుణ్ణీ తరమడం మొదలెట్టారు

''ఏదశ. ఎందుకులేని ఇడిసిపెట్టా'' అంటూ గుడ్లురిమిచూశాడు సుబ్రమణిని ఎల్లమ్మమొగుడు.

''ఏంజేసేడ్డిడివేంటి! '' అన్నాడు సుబ్రమణి.

'' ఏంజేస్తావోణ్ణా! '' అంటూ కొడవలి చూపించాడు ఎల్లమ్మ మొగుడు. మళ్లీ కథ పెరుగుతోందని మా అత్తగారు ఖంగారు పడ్డారు.

''పదండి పదండి బయటికెళ్ళి కొట్టుకు చావండి'' అంటూ మళ్లీ తరముడం మొదలెట్టారు.

''గడ్డికోసే కొడవలి జూపితే బయపట్టానికి నేను వంటయ్యోర్నిగాదు—'' అన్నాడు సుబ్రమణి.

''గడ్డి కోసేదా నీ పీక్కోసేదా'' అంటూ సుబ్రమణి మీదికి దూకాడు ఎల్లమ్మ మొగుడు.

అంతవరకూ ఏమీ ఎరగని దానిలా నిలబడి చూస్తున్న ఎల్లమ్మ కెక్కణ్ణుంచొచ్చిందో బలం ''ఒద్దు మావా ... . ఒద్దు'' ..... అంటూ అంత మగాణ్ణి నాటేసుకుని ఆపింది.

సుబ్రమణి మళ్లీ బ్రేండో స్టయిల్లో నవ్వేసి ఈలేసుకుంటూ గొడ్ల దగ్గిరి కెళ్ళిపోయాడు. ''రాసే'' అంటూ పెళ్లాం చేయి పట్టుకుని లాక్కెళ్లాడు వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ వెళ్లింది ఎల్లమ్మ.

ఎల్లమ్మ పోగానే మా అత్తగారు కాస్త తెప్పరిల్లి ''అదికాదే! చూశావా దా నఘాయిత్యం!.. .'' అన్నారు.

''అసలు ఎల్లమ్మకి సుబ్రమణి అంటే శానా ఇష్టం అమ్మగారూ'' అన్నాడు ముసి ముసి నవ్వులు నవ్వుతూ గుండుమణి

''సరి నీ యిష్టం మునదష్టంగానూ అది ఎంతయినా జేస్తుంది అన్యాయంగా ఆ వంట వెధవమీద పడ్డదే పాపం అసలేడీ వాడూ! . ''

అంటూ వంటవాడికోసం నాలుగు వేపులా చూశారు మా అత్తగారు.

''పూజ గదిలో దాక్కున్నాడమ్మగారూ '' అన్నాడు గుండుమణి నవ్వుతూ.

మా అత్తగారెళ్ళి పూజ గది తలుపు నెట్టారు.

దేవుడిముందు సాష్టాంగపడివున్న వంటవాడు ఒక్కసారి తుళ్లిపడి, ''శ్రీనివాసా రక్షించు'' అంటూ అరిచాడు—మళ్లీ ఎల్లమ్మ మొగుడే వచ్చాడని. ... మా అత్తగారికీ నాకూ నవ్వాగలేదు ''నేనయ్యానీ భయం మండిపోను అయినా, దానికి అన్నిసార్లు కాఫీయిచ్చిగొంతుమీదికి తెచ్చుకున్నావ్ చూశావా!. . '' అన్నారు ఏడిపించడానికి మా అత్తగారు . వంటవాడు చివాల్న లేచి మళ్లీ మా అత్తగారిముందు సాష్టాంగపడి లెంప లేసుకుంటూ.

''అమ్మా మీరూ నన్ను అపార్థం చేసుకున్నారా! .. ఏనాడో స్వసుఖాలను త్యజించి, శరీర సౌఖ్యాలను మరచి వంట చెరుకుల్లో వంట చెరుకువలె ''

''అబ్బబ్బ! ఆపవయ్యా ఎగతాళి కన్నానులె కాఫీ వేళయింది''—అంటూ ఆ రోజంతా పనిమనిషినీ, దాని మొగుణ్ణి తిడుతూనే ఉన్నారు మా అత్తగారు.

మర్నాడు మామూలుగాతెల్లారుగట్ల వచ్చి పాలు పిండి గొడ్ల పని చూసే సుబ్రమణి పనికిరాలేదు. ఇంక మా అత్తగారికి ఎక్కడలేని చిరాకూ వచ్చేసింది—కాసేపటికి గుండుమణి పరుగెత్తుకుంటూ వచ్చాడు. పెద్దమ్మగారూ, అమ్మగారూ అంటూ ....

పూజగదిలో వున్న నేనూ మా అత్తగారూ ఏం కొంప మునిగిందోనని బయటికి పరుగెత్తుకొచ్చాం..

''ఏమిట్రా! ఏమైంది! ఎందుకలా రొప్పుతున్నావ్!'' అని అడిగారు

''సుబ్రమణి ఇంక పనిలోకి రాడు '' అన్నాడు తలొంచుకుని సిగ్గుపడిపోతూ.

''ఏంరా! వాడికేం మొచ్చింది'' అన్నారు మా అత్తగారు.

''ఏం రాలేదు పెద్దమ్మగారూ! ఎల్లమ్మను తీసుకొని ఎక్కడికో వెళ్ళిపోయాడంట. ''

''ఆ!'' అంటూ మా అత్తగారు ముక్కుమీదవేలేసుకుని అలా ఎంతసేపు నిలబడ్డారో తెలీదు. నేను పూజ గదిలో కెళ్ళాను. ★